
# నాటక విశ్వ విద్యాలయం

## ఆచార్య మొదలి నాగభూషణ శర్మ



డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

# నాటక విశ్వవిద్యాలయం
# ఆచార్య మొదలి నాగభూషణశర్మ



రచయిత

డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు

అజో - విభొ - కందాళం ఫౌండేషన్

నాటక విశ్వవిద్యాలయం
ఆచార్య మొదలి నాగభూషణశర్మ

అజో - విభొ - కందాళం ఫౌండేషన్
ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం - 2019 సందర్భంగా..

రచయిత

డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు


ప్రచురణ కాలం : 2019, జనవరి 6

ప్రచురణకర్తలు :

అజో-విభొ కందాళం ఫౌండేషన్
3-3-24/1, ఎక్బోటే హౌస్,
కాచిగూడ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ - 500 527
ఫోన్ : 040 - 64512224, 40179673
డైరెక్టర్ : కందాళం జానకిరామాచార్యులు

***Please Visit our Website :***
***for foundation activities www.avkf.org***
***For AVKF book link www.avkf.org/b...***

# నాటక విశ్వవిద్యాలయం
# ఆచార్య మొదలి నాగభూషణశర్మ

నాటక విజ్ఞాన సర్వజ్ఞుడు... వివిధ ప్రక్రియల పరిశోధనా ప్రకాండుడు... రంగభూమిని తన ప్రయోగత్వంతో రసరాజ్యంగా మలచిన కళా ప్రద్యోతనుడు... తన అపార మేధోమథనంతో నాటక పరిశోధనకు పరిపూర్ణతను సిద్ధింపజేసిన కళాప్రహితుడు.. ప్రాక్పశ్చిమ నాటక శాస్త్ర అధ్యయన ప్రచేతనుడు ఆచార్య మొదలి నాగభూషణశర్మ. తెలుగు రంగవేదిపై విశ్వనాటక వెలుగు రేఖలను ప్రసరించిన నాటక ప్రవణుడు... అరిస్టాటిల్ ఆలోచనలను.. భరతుని అభినయ భావ పరంపరను అలవోకగా తెలుగు నాటక ప్రియులకు అక్షర రూపాన అందించిన ప్రాజ్ఞుడు.. ఆచార్య మొదలి. ఆయన కదిలే నాటక రథం. నడిచే నాటక విశ్వవిద్యాలయం... మూర్తీభవించిన రచనా దీపనం. రూపుగట్టిన అభినవ భరతాచార్య స్థిత ప్రజ్ఞత్వం. మొదలి రచనా వైదుష్యం.. అనువాద శైలీ విన్నాణం... దర్శక దార్శనికం... పరిశోధనా నైశ్చిత్యం.. తెలుగు నాటక రంగానికి నిత్య మార్గదర్శనం.. సత్యనికషోపలం.. వెలుగుబాటల సుప్రతిష్టం. నాటకం మొదలివారి శ్వాస.. ధ్యాస. వారి బ్రతుకు పుస్తకంలోని ప్రతి అక్షరం.. ప్రతి పంక్తీ.. ప్రతి పుటలో నాటకం కోసం ఒక తపన.. తపస్సు.. ఒక ప్రతీక.. పతాక.. ఒక విద్యుత్తు.. విద్వత్తు.. అణువణువునా.. అడుగడుగునా సుస్థిరమై ప్రత్యక్షమౌతాయి. ఆయన బోధన.. శోధన.. సాధన అద్వితీయం.. అనిర్వచనీయం. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన నాటక రంగ నిఘంటువు.

దాదాపు ఏడుదశాబ్దాల సుదీర్ఘకాలం రంగస్థల నటునిగా; రచయితగా; దర్శకునిగా; అనువాదకునిగా; ఆచార్యునిగా; పరిశోధకునిగా; బహుగ్రంథకర్తగా; సంపాదకునిగా బహుముఖీనంగా విద్యుత్తేజంతో విరాజిల్లిన ఆచార్య మొదలి నాగభూషణశర్మ పూర్వీకుల స్వస్థలం బ్రాహ్మణకోడూరు.

నర్సరావుపేటలో మేనమామ భాగవతుల వేంకట సుబ్బారావు ఇంట 1935 జూలై 24న జన్మించారు. తల్లిదండ్రులు సుబ్రహ్మణ్యశర్మ, కామేశ్వరమ్మ, తండ్రి ఉద్యోగరీత్యా రేపల్లెకి సమీపంలోని ధూళిపూడిలో సుదీర్ఘకాలం పనిచేయడంతో నాగభూషణ శర్మ ప్రాథమిక విద్యాభ్యాసం; నటనలో అక్షరాభ్యాసం ధూళిపూడిలోనే జరిగింది. విద్యాభ్యాసం; రంగస్థల ప్రవేశాలకు తొలిగురువు తండ్రి సుబ్రహ్మణ్య శాస్త్రి కావడం వారి అదృష్టం. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యం.ఎ; (ఇంగ్లీష్); వెస్టన్ ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయంలో యం.యఫ్.ఎ; భాషాశాస్త్రంలో పి.జి. డిప్లమో కోర్సును ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అభ్యసించారు. అమెరికన్ నాటకరంగంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టాను స్వీకరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్లశాఖో పన్యాసకులుగా 22 ఏళ్లు పనిచేశారు. ఉస్మానియా, హైదరాబాద్, కేంద్రీయ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాల్లో నాటక విభాగం ఆచార్యులుగా 18 సంవత్సరాలు ఉద్యోగించారు. ఆచార్య మొదలి పర్యవేక్షణలో 12మంది పరిశోధక విద్యార్థుల పి.హెచ్.డి., 22 మంది పరిశోధకులు యం.ఫిల్ పట్టాలను పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ విభాగం; సరోజినీనాయుడు రంగస్థల కళలశాఖలకు డీన్‌గా పనిచేశారు. పలు విశ్వవిద్యాలయాలకు; నాటక కళాశాఖలకు పాఠ్యాంశ నిర్ణాయక కమిటీ అధ్యక్షులుగా వ్యవహరించారు.

ఆచార్య మొదలి వారి తొలిరచన అన్వేషణ (నాటిక) నాగభూషన్ పేరుతో 1954 నుండి 74 వరకు చిన్నలు-పెద్దలు; వీలునామా; రాజదండం; కల-కాపురం; సంస్కర్తలు; అడ్డదారి; జననీ జన్మభూమి; అతిథి దేవోభవ అనే నాటికలను రచించారు. జననీ జన్మభూమి; జంట పక్షులు; రేపటి స్వర్గం; మరణ గీతం; విషాదాంతం; మన్మథుడు మళ్లీ పుట్టాడు; ప్రజానాయకుడు ప్రకాశం, మదన కామరాజు కథ; పెళ్లికి పదినిమిషాల ముందు అనే స్వతంత్ర నాటకాలను రచించారు. మృచ్ఛకటికం; ముద్రారాక్షసం; ప్రతిమ వంటి సంస్కృత నాటకాలను

తెలుగులోనికి అనువదించారు. పాశ్చాత్య నాటకాలైన యాంటిగని, మాక్‌బెత్; రాజా ఈడిపస్ నాటకాలను అదే పేర్లతో అనువాదం చేశారు. మోలియర్ ది మైజర్ (పిసినిగొట్టు) ; ఇబ్సన్ ఎ డాల్స్ హౌస్ (బొమ్మరిల్లు) ఓనీల్ యాన్ ఎనిమీ ఆఫ్ ది పీపుల్ (ప్రజల మనిషి) ఎంపరర్ జోన్స్ (దొరా నీ సావు మూడింది) జీన్ ది మ్యాడ్ ఉమెన్ ఆఫ్ ది చాలియట్ (రేపటి స్వర్గం) శామ్యూల్ బెకెట్ వెయిటింగ్ ఫర్ గోడోట్ (దేవుడయ్య వొస్తాడంట) నాటకాలను తెలుగులోనికి అనువాదం చేశారు. దేశీయంగా బహుళ ప్రజాదరణ పొందిన పలు నాటకాలను మొదలి యథోచితానుసరణగా తెలుగు వాతావరణ ప్రతిబింబంగా ఆంధ్రీకరించారు. ఠాగూర్ రచించిన బలిదాన్ (బలిదానం); రెడ్ ఓలియండర్స్ (ఎర్రగన్నేరు); భీష్మసహానీ కబీరఖాదా బజార్‌మి (కబీరు పిలుస్తున్నాడు వినండి) గిరీష్ కర్నాడ్ హయవదన (హయవదన) చంద్రశేఖర కంబార సాంబశివ ప్రహసనం (సాంబశివ ప్రహసనం) విజయ్ టెండూల్కర్ సైలెన్స్ ది కోర్ట్ ఈజ్ ఇన్‌సెషన్ (నిశ్శబ్దం కోర్టు నడుస్తుంది) ధర్మవీర్ భారతి అంధాయుగ్ (అంధయుగం) శంకరేష్ ఎ పేపర్ టైగర్ (కాయితం పులి) నాటకాలను అనువదించి స్వీయదర్శకత్వంలో ప్రదర్శించారు.

కింగ్ ఈడిపస్; ట్వల్త్‌నైట్; ది విజిట్; మాడ్ ఉమెన్ ఆఫ్ చాలియట్; శాక్రిఫైస్; రెడ్ ఓలియండర్స్; వెయిటింగ్ ఫర్ గోడోట్; హయవదన; మృచ్ఛకటిక; తుగ్లక్ వంటి ఆంగ్ల నాటకాలతో పాటు నాటకం; విశ్వశాంతి; మానవుడు; నాలుగిళ్ల చావిడి; ప్రతాప రుద్రీయం; దేవుని ఎదుట విషాదాంతం; రాజా ఈడిపస్; నరజాతి చరిత్ర సమస్తం; మదన కామరాజు కథ; ప్రజా నాయకుడు; ప్రకాశం వంటి నాటకాలకు దర్శకునిగా వ్యవహరించారు. కన్యాశుల్కం; నాటకం; విషాదాంతం; గృహప్రవేశం; ముద్రారాక్షసం; విశ్వశాంతి; ప్రజా నాయకుడు; ప్రకాశం వంటి నాటికలలో ముఖ్య భూమికలను పోషించారు.

తెలుగు; ఇంగ్లీష్; హిందీ; సంస్కృత భాషల్లో పండితులైన మొదలి నాటకం; నవల; కథ; జానపద కళారంగం; నృత్యం ఒకటేమిటి అనేక ప్రక్రియా

రంగాలను ఔపోసన పట్టారు. వారు గొప్ప చదువరి. మీదు మిక్కిలి మహాపండితులు. స్వీయాసక్తిని; అభినివేశాన్నీ; అనుభవాలను భూమికగా చేసుకొని ఎన్నో గొప్ప గ్రంథాలను రచించారు. అసమాన గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. మొదలి రచించిన ప్రక్రియా వైవిధ్యమైన ఎన్నో గ్రంథాలు కాలానికి నిలిచే నిత్యపఠనీయాంశాలు. వారి రచనల్లో నెల్లూపొల్లూ ఉండదు. నిశిత అవగాహన; పరిశోధనతో ప్రామాణికంగా అలరారుతూ ఉంటాయి. భారతీయ నాటకరంగంలో ఏకైక కుటుంబ నాటక సమాజంగా పేరుపొందిన సురభి నాటక సమాజ సమగ్ర చరిత్రను అక్షరబద్ధం చేసిన తొలి పరిశోధనా రచయితగా మొదలివారు చరిత్ర సృష్టించారు. సురభి నాటక చరిత్రతో పాటు ప్రముఖ సురభి కళాకారులు; వారి ప్రదర్శనా విధానాలను సోదాహరణంగా వివరిస్తూ ఆంధ్రదేశంలో సురభి నాటకం; సురభి కుటుంబ నాటక సమాజం అనే రెండు ఆంగ్ల గ్రంథాలను రచించారు.

విశ్వవిఖ్యాత నటుడైన బళ్లారి రాఘవ నటదర్శక విశ్వరూపాన్ని సమగ్రంగా వివరిస్తూ **BELLARY RAGHAVA PRINCE OF PLAYERS** అనే గ్రంథాన్ని రచించారు. తెలుగు సాంఘిక నాటక రంగాన్ని తన ఇతివృత్త వైవిధ్యంతో; సంభాషణా వైచిత్రితో అద్భుతమైన మలుపు తిప్పిన ఆత్రేయ నాటక సాహిత్యాన్ని సశాస్త్రీయంగా విశ్లేషిస్తూ **TELUGU THEATRE AND ACHARYA ATREYA** అనే గ్రంథాన్ని వెలయించాడు. రచన; ప్రదర్శనా పరంగా సంచలన విజయాలను సృష్టించిన ప్రముఖ తెలుగు నాటకాలపై పరిశోధనాత్మకంగా **MAJOR STAGEABLE PLAYS IN TELUGU** గ్రంథాన్ని వ్రాశారు. ప్రాక్పశ్చిమ నాటక రంగాలలోని పారిభాషిక పదాల వ్యుత్పత్తి, అర్థవివరణలను వివరిస్తూ వ్రాసిన నాటక రంగ నిఘంటువును **A DICTIONARY OF THEATRE TERMS (NATAKA RANGA PARI BHASHIKA PADAKOSAM** ను అనితర సాధ్యంగా రూపొందించారు. ఈ నిఘంటువులో 2000 నాటక రంగ సంబంధిత పదాలకు వ్యుత్పత్తి; అర్థవివరణ ఇవ్వడం విశేషం.

"గయోపాఖ్యానం" వంటి నాటక రాజాన్ని తెలుగు నాటక ప్రియులకు కానుకగా అందించిన చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు గారి నటజీవన ప్రస్థానాన్ని మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా "నాటక కర్త చిలకమర్తి" అనే గ్రంథాన్ని మొదలి రచించారు. నాటకరంగ అధ్యయనం చేసే విద్యార్థులకు ఉపయుక్తమయ్యే తెలుగు నాటకరంగ స్వరూపాన్ని వివిధ కోణాలలో విశ్లేషించి; వింగడించి "రంగస్థల శాస్త్రము" అనే పాఠ్యగ్రంథాన్ని రచించారు. పాశ్చాత్య, భారతీయ నాటక సమగ్ర స్వరూపాన్ని విశ్లేషించి మొదలి రూపొందించిన అద్భుత నాటక విమర్శ గ్రంథం "నాటక శిల్పం". ఈ గ్రంథానికి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పురస్కారం లభించింది. తెలుగు నాటకరంగ ఆరంభ; వికాసదశల్లో తన పద్యగాన మాధుర్యంతో ప్రేక్షకలోకాన్ని రసానంద డోలికల్లో ముంచెత్తిన నటశేఖరుల జీవన రేఖలను రెండు గ్రంథాలుగా ముద్రించడంతో పాటు ఆ అమర గాయకుల గాత్రాల అమృతపు సోనలను ఆరుగంటల నిడివి గల సి.డి.ల ద్వారా ఈనాటి ప్రేక్షక లోకానికి అమూల్యమైన కానుకగా, తీపి జ్ఞాపికగా మొదలి అందించారు. స్త్రీ పాత్రధారణతో తెలుగు నాటక రంగంలో అనర్ఘరత్నంగా శోభిల్లిన స్థానం నరసింహారావు నట ప్రస్థానాన్ని గ్రంథంగా రచించడంతో పాటు వారి రెండు నాటక రాజాలను ; 30 పద్యాలు; పాటలను సి.డిల ద్వారా శ్రోతలకు బహూకరించారు. తన శ్రుతిపేయమైన గానమాధుర్యంతో పాటు ఈల పాటతో ప్రతి ప్రేక్షకుని చెవులలో అమృతం పోసిన అమర గాయకుడు కళ్యాణం రఘురామయ్య జీవిత చరిత్రను; నట ప్రస్థానాన్ని అద్భుత పరిశోధనా గ్రంథంగా తెలుగుజాతికి సమర్పించారు. ఆంధ్రనాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు నాటక ప్రస్థానాన్ని గ్రంథ రూపంలో తీసుకొని రావడంతోపాటు ఎన్నో ఏళ్ల తరబడి శోధించి ధర్మవరం వారి 20 నాటకాలను మూడు సంపుటాలుగా ముద్రించి తెలుగు నాటక రంగానికి మహోపకారాన్ని చేశారు. కన్యాశుల్కం నూరేళ్ల పండుగ

సందర్భంగా.. కన్యాశుల్కం నాటకంపై వెలువడిన 182 అరుదైన వ్యాసాలను 1000 పేజీలతో ముద్రించిన కన్యాశుల్కం నూరేళ్ల సమాలోచనం సంకలన గ్రంథయజ్ఞానికి మొదలి సంపాదకులుగా వ్యవహరించారు.

నూరేళ్ల తెలుగు నాటకరంగం వ్యాస సంకలనానికి నాట్యకళ శతజయంతి ప్రత్యేక సంచికకు మొదలి సంపాదకులుగా వ్యవహరించారు. జస్టిస్ పి.వి. రాజమన్నార్ "తప్పెవరిది" నాటక పునర్ముద్రణలో తెలుగు నాటకంపై ఇబ్సన్ ప్రభావం అనే సాలోచనతో మొదలి వ్రాసిన సమగ్రమైన ముందుమాట ఒక గొప్ప పరిశోధనా వ్యాసంగా పేరు పొందింది. పురాణం సూరిశాస్త్రి రచించిన నాట్యాంబుజం; నాట్యాశోకం గ్రంథాల పునర్ముద్రణకు సంపాదకులుగా వ్యవహరించారు.

**OXFORD COMPANION TO INDIAN THEATRE OXFORD ENCYCLOPEDIA OF THEATRE, PERFORMANCE ENCYCLOPEDIA OF INDIA LITERATURES** అనే గ్రంథాలలో మొదలి రచించిన పలు నాటక రంగ వ్యాసాలు ముద్రితమయ్యాయి. 1990-95 మధ్యకాలంలో ఇండియన్ థియేటర్ జర్నల్‌కు సంపాదకులుగా వ్యవహరించారు. ఇండియన్ థియేటర్ పత్రికకు నాట్యకళ ప్రచురించిన పలు ప్రత్యేక సంచికలను ; సురభి నాటకరంగ ప్రత్యేక సంచికలకు సంపాదకులుగా వ్యవహరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ మంజూరు చేసిన నిధులతో పద్యనాటకం అనే పరిశోధన గ్రంథాన్ని రచించారు. పాశ్చాత్య; భారతీయ; తెలుగు నాటక రంగంపై వెలువడిన 35వేల పేజీల ముద్రిత సమాచారాన్ని సేకరించారు. సురభి నాటకరంగంపై విలువైన సమాచారాన్ని పరిశోధించి రెండు గ్రంథాలను రచించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ; నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా తెలుగు రాష్ట్రాలలో పలు సందర్భాలలో నటన; దర్శకత్వం; నాటక రచనలపై నిర్వహించిన కార్యశాలలకు దర్శకులుగా వ్యవహరించారు. కాలగర్భంలో కలిసిపోయిన తెలుగు నాటకరంగ మహనీయుల చరిత్రలను పరిశోధించి గ్రంథస్థం చేయడం ద్వారా నాటక రంగానికి

మహోపకారం చేశారు. కె. చిరంజీవి రచించిన వంశాంకురం; కాలచక్రం నాటకాలను ఇంగ్లీష్‌లోకి అనువదించారు.

నాటక రంగానికి మొదలి చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర ప్రభుత్వం ఠాగూర్ అకాడమీ రత్న పురస్కారాన్ని పొందారు. 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నందమూరి తారక రామారావు రంగస్థల పురస్కారాన్ని; 2018లో కళారత్న పురస్కారాలను స్వీకరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంచే ప్రతిభామూర్తి పురస్కారాన్ని పొందారు. విజయనగరం సాహితీ సమాఖ్య వారి గురజాడ పురస్కారం; 1995లో 'తానా' సంస్థ వారి నాటక రంగ ప్రముఖుడు పురస్కారాలను అందుకొన్నారు. అక్కినేని స్వర్ణపతకం; యన్.టి.ఆర్. స్వర్ణపతకాలతో పాటు హైదరాబాద్ శ్రీ కళానికేతన్ వారి జూలూరి వీరేశలింగం స్వర్ణపతకం; అనంతపురం లలిత కళాసమితి వారి బళ్లారి రాఘవ పురస్కారాన్ని; హైదరాబాద్ అభినందన సంస్థ వారి ఆచార్య ఆత్రేయ పురస్కారాన్ని; రావులపాలెం సి.ఆర్.సి. కళాపరిషత్ వారి కాటన్ కళా పురస్కారాన్ని; బళ్లారి డి.ఆర్.కె. ట్రస్ట్ వారి ధర్మవరం రామకృష్ణమాచార్యులు రంగస్థల పురస్కారాన్ని; తెనాలి రంగస్థల కళాకారుల సంఘం వారి జీవన సాఫల్య పురస్కారాలను స్వీకరించారు.

కేంద్ర సంగీత నాటక అకాడమీ; నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా; కేంద్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ సలహా సంఘ సభ్యులుగా వ్యవహరించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక మండలి సభ్యులుగా; ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తెలుగు నాటక శతజయంతి ఉత్సవ కమిటి సభ్యులుగా; ఉస్మానియా విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యులుగా వ్యవహరించారు. కలకత్తా శాంతినికేతన్ విశ్వవిద్యాలయ నాటక విభాగం పాఠ్యాంశ నిర్ణాయక కమిటి సభ్యులుగా; కేంద్ర సంగీత నాటక అకాడమీ యువ దర్శక నాటకోత్సవాల కమిటీకి సుదీర్ఘకాలం సలహా సంఘ సభ్యులుగా వ్యవహరించారు. హైదరాబాద్

రసరంజని సంస్థ నిర్వహించిన పలు వైవిధ్యమైన నాటకోత్సవాలకు డైరక్టర్‌గా ఉన్నారు. రసరంజని సంస్థ అలనాటి నాటకం, నేటి ప్రేక్షకులు అనే వినూత్న నాటకోత్సవాలకు మొదలి కీలక నిర్వహణా బాధ్యతలను వహించారు. 2006లో రాష్ట్ర సాంస్కృతిక విధానం రూపకల్పన కమిటి అధ్యక్షులుగా నియమితులయ్యారు. రవీంద్ర భారతి పునర్నిర్మాణ కమిటి అధ్యక్షులుగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ తోలుబొమ్మలాట అభివృద్ధి సంస్థ (అప్పా) హైదరాబాద్ ప్రదర్శనా కళల పరిశోధక సంస్థ అధ్యక్షులుగా, సురభి వృత్తి కళాకారుల సంస్థ సలహాదారులుగా; రసరంజని సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులుగా; న్యూఢిల్లీ ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయ సలహాసంఘం సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. అమెరికా; ఫ్రాన్స్; రష్యా; జపాన్; గ్రీస్; టర్కీ వంటి దేశాల నాటకోత్సవాలలో పాల్గొనడంతో పాటు ఆయా దేశాల నాటక రంగ లక్ష్య లక్షణాలను స్వయంగా పరిశీలించారు.

తెలుగు నాటకం-సమాజం; రూపక మంజరి; తెలుగు నాటక ఉద్ధాన పతనాలు; ఆచార్య ఆత్రేయ; కన్యాశుల్కం-శతాబ్ది నాటక అడుగుజాడ వంటి 30కి పైగా ఆంగ్లవ్యాసాలు కేంద్ర సంగీత నాటక అకాడమీ; నాట్యకళవంటి అధికారిక పత్రికల్లో ప్రచురితమయ్యాయి.సంస్కృత నాటకాలు; ఆధునిక భారతీయ నాటకం; వంటి సమీక్ష వ్యాసాలు నాటక పరిశోధనలో ఉన్నత ప్రామాణికాలుగా నిలిచాయి. పి.వి. రాజమన్నార్; స్థానం నరసింహారావు; బళ్లారి రాఘవ; కొర్లపాటి గంగాధరరావు; దక్షిణ భారత నాటక సంప్రదాయాలు; తెలుగు నాటక విమర్శ; వంటి కీలక ఉపన్యాసాలు మొదలి పరిశోధనా పటిమకు దర్పణాలుగా నిలిచాయి.

మొదలి వారి నూరేళ్ల తెలుగు నాటకరంగం; ఆధునిక నాటకాల్లో మానవ చిత్రణ; దర్శకత్వం - నాడు నేడు; తెలుగు నాటకరంగం రచన, ప్రయోగం; తెలుగులో శ్రవ్యరూపకాలు; తెలుగు నాటక రంగం ప్రయోగాలు;

శ్రవ్యరూపకం; దేశీరూపక వికాసం; ఆంధ్ర నాటక రంగంపై పాశ్చాత్య ప్రభావం; అనిబద్ధ నాటక రంగం; ఔత్సాహిక నాటక రంగం; నటశిక్షణ; మొదటి తెలుగు నాటకం; ప్రథమ తెలుగు నాటక విమర్శకుడు పురాణం సూరిశాస్త్రి; తెలుగు నాటకంలో సమయశిల్పం; తెలుగు నాటకరంగం దర్శకత్వ ప్రయోగాలు; వంటి గొప్ప వ్యాసాలు తెలుగు నాటక వివేచనకు కరదీపికలుగా నిలిచాయి. కేంద్ర; రాష్ట్ర ప్రభుత్వ నాటక విభాగాలు; నాటకరంగంపై వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన జాతీయ సదస్సుల్లో 30కి పైగా కీలకోప న్యాసాలను చేశారు. వానిలో పిల్లలతో నాటకాలు వేయించడం ఎలా, ఆంధ్ర నాటక కళాపరిషత్ విధి విధానాలు, తెలుగు జానపద కళారూపాలు, నాటకం; తెలుగు నాటకం ప్రక్రియా పరిశీలన ; ఆధునిక వీధి నాటకం; తెలుగు నాటకం జాతీయోద్యమం; నాటక శిక్షణ - అవసరం వంటి ఉపన్యాస వ్యాసాలు మొదలి వారి అత్యద్భుత పరిశీలన; పరిశోధనలకు నిదర్శనాలుగా నిలిచాయి. ఆకాశవాణిలో 20పైగా నాటక ప్రసంగాలను చేశారు. తెలుగు నాటకంలో హాస్యం వేసిన చిందులు అనే అంశంపై 60 నాటకాలను విశ్లేషిస్తూ 3 గంటల వ్యాఖ్యానాన్ని ఆకాశవాణిలో చేశారు. ఆంధ్ర మహిళాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటక శిక్షణా శిబిరానికి దర్శకులుగా వ్యవహరించారు. రసాంజలి సంస్థ హైదరాబాదులో మొదలి నాటక రచనలతో మూడురోజులు నాటకోత్సవాలను నిర్వహించింది.

మాష్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కోర్సులో భాగంగా 1974లో **AESTHETICIS OF INDIAN ACTING** అనే అంశంపై ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయానికి పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ నాటక విభాగం కోసం **"STAGEABLE PLAYS IN TELUGU"** అనే పరిశోధనతో నాటక సూచిని రూపొందించారు. నాటక విద్యార్థుల కోసం **"METHODOLOGY FOR ACTING ACCORDING TO BHARATA'S NATYA SASTRA"** అనే వర్క్‌బుక్‌ను తయారు చేశారు. ఈ మహత్తర గ్రంథం నాటక విద్యార్థులకు

నిత్యఉపయుక్తంగా నిలిచింది. భారత సాంస్కృతిక వ్యవహారాలశాఖ సహకారంతో 1880 నుండి 1928 వరకు నాటక వికాసం కోసం కృషిచేసిన నాటక సమాజాల కృషిని క్షేత్రస్థాయిలో పర్యటించి వ్రాసిన పరిశోధనా గ్రంథం. **"SIXTEEN MAJOR THEATRE GROUPS IN ANDHRA"** 1992లో హైదరాబాద్ ప్రదర్శనా కళల పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో **"MAJOR TELUGU PLAY WRIGHTS AND THEIR REPRESENTATIVE PLAYS** అనే గ్రంథాన్ని రచించారు.

## జానపద కళాభారతికి కర్పూర హారతి

జ్ఞానపథాలను ఆవిష్కరించే తూర్పువాకిళ్లు జానపదాలు. పల్లీయుల ఆచార్య వ్యవహారాలు - సంస్కృతీ సంప్రదాయాల గుండెచప్పుళ్లు జానపద కళారూపాలు. నాటకమ్మకు పెద్దక్కగా నిలిచిన జానపద కళారూపాల పునరుద్ధరణకు మొదలి చేసిన కృషీవలత్వం నిరుపమానమైనది. విశ్వవేదికపై తెలుగువారి జానపద కళారూపాల విశ్వరూపాన్ని ప్రదర్శింపజేయడంతో పాటు తన అవిశ్రాంతమైన పరిశోధనతో అక్షరబద్ధం చేసి జానపదుల ఆత్మబంధువుగా నిలిచారు. 64 జానపద ప్రదర్శనా కళల పుట్టు పూర్వోత్తరాలను క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశోధించి **"FOLK PERFORMING ARTS OF ANDHRA PRADESH"** అనే అద్భుతమైన గ్రంథాన్ని ఆంగ్లంలో రచించారు. తెలుగునాట సుప్రసిద్ధమైన, సుప్రతిష్టమైన తూర్పు భాగవతం ప్రదర్శన కళారూపంపై వ్రాసిన మరొక ఆంగ్ల పరిశోధనాగ్రంథం **"TOORPU BHAGAVATHAM"**. తోలుబొమ్మలాట కళారూపంపై ఎన్నో అద్భుతమైన వ్యాసాలను వ్రాయడంతో పాటు ఆ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి వారి సంక్షేమానికి విశేషమైన కృషి చేశారు. **"TOLUBOMMALATA; THE SHADOW PUPPET THEATRE OF ANDHRA PRADESH; FOLK THEATRE OF SOUTH INDIA; YAKSHAGANA TRADITIONS IN ANDHRA"** వంటి పరిశోధనా వ్యాసాలను జాతీయస్థాయిలో జరిగిన సదస్సుల్లో పత్ర సమర్పణ చేశారు. కేంద్ర

సంగీతనాటక అకాడమీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన యక్షగాన సంప్రదాయం కార్యశాలకు ప్రధాన నిర్వాహకునిగా వ్యవహరించారు. వివిధ విశ్వవిద్యాలయాలు; కేంద్ర; రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించిన జానపద కళల సదస్సుల్లో 60కి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. రష్యా; ఏథెన్స్; జపాన్ దేశాలలో తొమ్మిది పర్యాయాలు జరిగిన అంతర్జాతీయ తోలుబొమ్మలాట ఉత్సవాలలో ఆంధ్ర, రాష్ట్ర బృందానికి నాయకత్వం వహించడంతో పాటు అక్కడ జరిగిన సదస్సుల్లో తెలుగువారి తోలుబొమ్మలాట ప్రాచీనత; విశిష్ఠతలపై పత్ర సమర్పణ చేశారు. తెలుగునాట ఉన్న ఆటవిక జానపద కళారూపాల పరిరక్షణకు కేంద్ర, సంగీత, నాటక అకాడమీ పక్షాన ప్రధాన సలహాదారునిగా నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1970, 1985, 1992లో నిర్వహించిన జానపద కళోత్సవాల నిర్వహణకు మొదలిని ప్రధాన నిర్వాహకునిగా నియమించింది. తెలుగునాట ఉన్న జానపద కళారూపాలను దూరదర్శన్ ద్వారా ఆరు ఎపిసోడ్లుగా ప్రసారం చేయడానికి కార్యనిర్వాహక దర్శకునిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని ఫ్రెంచి; జర్మన్ భాషల్లోకి తర్జుమా చేసి, ఆ దేశాలలో ప్రసారం చేశారు. తోలు బొమ్మలాట కళారూపంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక సదస్సులను నిర్వహించారు. దేవాలయ ఉత్సవాలలో ప్రత్యేకంగా ప్రదర్శించబడే జానపద కళారూపాలను వీడియో చిత్రీకరణ ద్వారా పదిలపరిచారు.

జానపద కళారూపాల పరంపరపై మొదలి వ్రాసిన జానపద కళారూపాల పరిణామ విధానం; తెలుగువారి తొలిసినిమా–తోలుబొమ్మలాట; జానపద కళల్లో జనజీవనం; తెలుగువారి సమిష్టిగానలహరి తరంగగానం; తెలంగాణా పటం కథల ప్రాముఖ్యం వంటి పరిశోధక వ్యాసాలు జానపద కళా పరిశోధకులకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయి. తెలుగు జానపదులు –

జానపద కళలు; మేలత్తూరు భాగవత మేళా - కూచిపూడి యక్షగానం; జానపద కళారూపాలు-ప్రగతి మాధ్యమం; యక్షగానం-కలాపం; తెలుగు యక్షగాన ప్రదర్శన వంటి అంశాలపై జాతీయ సదస్సుల్లో కీలకోపన్యాసాలను చేశారు. తెలుగునాట ఉన్న వీధి నాటకం; యక్షగానం; తూర్పు భాగవతం; పగటి వేషాలు; తోలుబొమ్మలాట వంటి జానపద కళాప్రక్రియలపై అనేక వ్యాసాలు, గ్రంథాలను రచించారు. మొదలివారికి జానపద కళారూపాలంటే మక్కువెక్కువ. అందుకే దొరా నీ సావు మూడింది నాటకంలో శారదకథ; వీరవిద్యావంతులు; ఒగ్గు కథ జానపద కళారూపాలను అంతర్భాగంగా చేశారు. ఈ ప్రయోగం సంపూర్ణ రససిద్ధికి దోహదం చేసింది.

## నృత్యరత్నావళికి పరిశోధనా కైమోడ్పులు

భారతీయ సంప్రదాయ నృత్యరీతులలో కూచిపూడి; భరతనాట్యాలకు గణ్యచరిత్ర ఉంది. అభినయ దర్పణాలైన ఈ నృత్యరీతుల పరిరక్షణకు; వ్యాప్తికి మొదలి చేసిన సేవలు; పరిశోధనాకృషి చిరస్మరణీయమైనది. 34 మంది కూచిపూడి నృత్యగురువుల ప్రతిభా విశేషాలను సవిస్తరంగా వివరిస్తూ వ్రాసిన **"KUCHIPUDI GURUS PERFORMERS AND PERFORMANCE TRADITIONS"** అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు. కలాపం; యక్షగానం; నృత్యనాటకాలలోని నృత్యరీతులను ఈ గ్రంథంలో సాకల్యంగా పొందు పరిచారు. నర్తనం అనే త్రైమాసిక పత్రికను 2001లో ప్రారంభించి దశాబ్ద కాలానికి పైగా సంపాదకులుగా వ్యవహరించారు. నృత్య విశేషాలను వివరించే పత్రికలు బహుఅరుదుగా ఉన్నస్థితిలో మొదలివారి ప్రయత్నం అద్భుతమైనది. ఈ పత్రిక ద్వారా భారతీయ నృత్యకళల ప్రచారానికి ఈ పత్రిక జాతీయస్థాయిలో తనదైన పాత్రను పోషించింది. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో నృత్యరీతులపై మొదలి 30కి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. అమ్మన్నూర్ మాధవచాక్యార్; మీనాక్షి సుందరం పిళ్లై, నటరాజ రామకృష్ణ, వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి; ఆనంద కుమారస్వామి; రుక్మిణీదేవి; రామ్‌గోపాల్; కేలూచరణ్ మహాపాత్ర;

వెంపటి చినసత్యం; వేదాంతం సత్యనారాయణశర్మ; కోరాడ నరసింహారావు; బిర్జూ మహారాజ్ వంటి నాట్యగురువుల సంప్రదాయాలు; వైశిష్ట్యాన్ని గూర్చి వ్రాసిన వ్యాసాలు ప్రామాణికమైనవి. స్వాతంత్ర్యానంతర నాట్యరీతులు; వంటి వ్యాసాలు మొదలి వారి పరిశోధనా పటిమకు నిలువెత్తు దర్పణాలుగా నిలిచాయి. ఆక్స్‌ఫర్డ్ విజ్ఞాన సర్వస్వంలో కూచిపూడి నృత్యరీతులపై వ్యాసాన్ని వ్రాశారు. నటరాజు రామకృష్ణ నాట్యవైభవంపై పదిగంటల వీడియోను ఇంటర్వ్యూ చేసి భద్రపరిచారు. హైదరాబాద్‌లో జరిగిన యువనృత్యోత్సవాలకు కూచిపూడి నృత్యోత్సవాలకు; యక్షగాన; నృత్యనాటకోత్సవాలకు కేంద్ర సంగీత, నాటక అకాడమీ పక్షాన ప్రధాన నిర్వాహకులుగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నాట్యపరిశోధన అభివృద్ధి కోసం స్థాపితమైన లాస్యప్రియ సంస్థకు సుదీర్ఘకాలం అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు.

**సాహితీ సమర్చనం :**

నాటకం; జానపదం; నృత్యరంగాలతో పాటు తెలుగు సాహిత్య వికాసానికి మొదలి చేసిన కృషి నిరుపమానమైనది. మహాత్ముని ఆశయాలు, సిద్ధాంతాల ప్రభావంతో వెలువడిన తెలుగు సాహిత్య విశ్లేషణ నేపథ్యంగా 1968లో మొదలి తెలుగు సాహిత్యం గాంధీజీ ప్రభావం అనే గ్రంథాన్ని రచించారు. మొదలి రచించిన తెలుగు నవలా వికాసం అనే గ్రంథం పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆవశ్యక ఆధారంగా నిలిచింది. రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు సందర్భంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించిన భారత భారతి విశేష సంచికకు మొదలి సంపాదకులుగా వ్యవహరించారు. డాక్టర్ రావూరి భరద్వాజ రచించిన కాదంబరి నవలను మొదలి ఆంగ్లంలోకి అనువదించారు. మరాఠీ నవలా రచయిత హరినారాయణ్ ఆప్టే జీవిత చరిత్రను, భీష్మ సహానీ రచించిన బలరాజ్ సహాజీ జీవిత చరిత్రను మొదలి ఆంగ్లం నుండి ఆంధ్రీకరించారు.

## బహుముఖీన ప్రతిభకు శిరసానమామి

ఒక భాషలో విజయవంతమైన నాటకాన్ని మరో భాషలోకి యధామాతృకంగా; స్వేచ్ఛానువాదంగా; ఆ వస్తువును స్వీకరించి తమ ప్రాంతీయత ప్రతిబింబించే విధంగా అనువాదాలుంటాయి. కానీ మొదలి వారి అనువాద శైలి విలక్షణమైనది. వారు పండితులు; పరిశోధకులు; ఆచార్యులు, త్రివేణీ సంగమాత్మకమైన ఈ ఆలోచనా లోచనంతో ఒక కవితాత్మకశైలి అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటుంది. ప్రాంతీయత సహజంగా ఒప్పారుతూ ఉంటుంది. ఆచార్యత్వ నేపథ్యం ఉండడంతో అటుగ్రీకు నాటకం; ఆంగ్ల నాటకంతో పాటు దేశీయంగా సంస్కృత, కన్నడ, హిందీ, మరాఠీ నాటకాలను అనువదించి ఆయా నాటక శైలులను అటు విద్యార్థులకు, ఇటు నాటకాభిమానులకు సుస్పష్ట పరిచయం చేశారు. మొదలి నిత్యసత్య అన్వేషి. నిరంతర నాటక అనుశీలనం; అధ్యయనం వారి నిజనైజం. పరిశోధనకు హిమశైల శిఖరం వంటివారు. అనంతమైన నాటక సమాచారాన్ని పుక్కిట బట్టిన అభినవ అగస్త్యుడు. నాటకాన్ని సాధికారికంగా చెప్పాలన్నా.. పరిశోధించాలన్నా.. వ్రాయాలన్నా మొదలికి మొదలే సాటి... అందుకే మొదలి నుండి నాటకాన్ని వేరు చేసినా నాటకం నుండి మొదలిని వేరు చేసినా అక్కడ మిగిలేది అనంతమైన శూన్యం. దాన్ని ఊహించడమే కష్టం. ఆయన నాటక దర్శనం.. నాటక దర్పణం. మొదలి నాటకానికి ఎంతో.. ఎంతో చేశారు. ఎంత అంటే చెప్పలేనంత. తెలుగు నాటకమే మొదలి వారికి సదా ఋణగ్రస్తం.





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నుండి కళారత్న (హంస) 2018
పురస్కారాన్ని స్వీకరిస్తున్న ఆచార్య మొదలి